# సాక్షి బాపట్ల

శుక్రవారం : 26 : జనవరి : 2024






## ధ్వజస్తంభం ఊరేగింపు

గొరిగపూడి(భట్టిప్రోలు): స్థానిక వాగేశ్వరస్వామి ఆలయ పునః ప్రతిష్టా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ధ్వజస్తంభ గ్రామోత్సవం నిర్వహించారు.



## విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

పెసర్లంక(భట్టిప్రోలు): స్థానిక దేవభక్తుని కోటయ్య జెడ్పీ హైస్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థులకు గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 520.20 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 11,613 క్యూసెక్కులు విడుదలవుతోంది.

## న్యూస్‌రీల్

### ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్‌పై దుష్ప్రచారం



నరసరావుపేట: రాష్ట్రంలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటళ్లలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశారని జరుగుతున్న దుష్ప్రచారాన్ని వైఎస్సార్ సీపీ డాక్టర్ సెల్ కార్యదర్శి డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఖండించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒక వర్గ మీడియా ద్వారా ఈ దుష్ప్రచారం జరుగుతుందని, దీని వలన పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆరోగ్యశ్రీ సేవలను అమలుచేస్తూ పేదల కోసం సుమారు 3వేలకు పైగా రోగాలకు ఉచిత వైద్యసేవలు అందజేస్తుందన్నారు. ఇటువంటి పథకాన్ని ఎన్నికల వేళ నీరుగార్చి ప్రభుత్వంపై వ్యతిరేక భావం తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ కుట్రకు పాల్పడుతున్నారన్నారు. దీనిని ప్రజాస్వామ్యవాదులు అందరూ ఖండించాలని కోరారు.

### మిర్చి యార్డుకు వరుస సెలవులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా యార్డుకు సెలవు ప్రకటించారు. అలాగే శని, ఆదివారాలు యార్డుకు సాధారణ సెలవులు కావడంతో మూడు రోజులపాటు యార్డుకు సెలవులు ప్రకటించడం జరిగిందని మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెట్ కమిటీ రీజనల్ సంయుక్త సంయుక్త సంచాలకులు కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. యార్డులో 29వ తేదీ నుంచి యథావిధిగా క్రయ, విక్రయాలు కొనసాగుతాయని వెల్లడించారు. సెలవు రోజుల్లో రైతులు మిర్చి బస్తాలను యార్డుకు తీసుకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

### యార్డులో 1,19,090 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,14,103 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,19,090 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.20,100 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 59,352 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

### 28న జగ్జీవన్‌రామ్ మనవడు తెనాలి రాక



తెనాలిరూరల్: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ మనుమడు, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ కుమారుడు అన్షుల్ అవిజిత్ ఈ నెల 28వ తేదీన తెనాలి రానున్నట్టు సినీ దర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు. సుల్తానాబాద్‌లోని ఓ కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తన దర్శకత్వంలో తెరకెక్కుతున్న బాబూజీ చిత్రంలో అన్షుల్ అవిజిత్ కొన్ని కీలక సన్నివేశాల్లో నటించనున్నారని తెలిపారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయ స్క్రీనింగ్ కమిటీ మాజీ సభ్యురాలు ఆరుగొలను జాస్మిన్, బీజేఆర్ కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్ మాట్లాడారు.

### 29 నుంచి డిస్కంలపై ప్రజాభిప్రాయ సేకరణ

నగరంపాలెం: ఏపీఈఆర్‌సీ ఆధ్వర్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన డిస్కంల వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఐదో నియంత్రణ కాలానికి అనుగుణంగా ఈనెల 29, 30, 31 తేదీల్లో వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) ద్వారా వైజాగ్ నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరగనుందని గుంటూరు సర్కిల్ ఎస్‌ఈ మురళీకృష్ణయాదవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చేనెల 1న ఏపీ జెన్‌కో టారిఫ్ అప్లికేషన్ ఫర్ 4వ కంట్రోల్ పీరియడ్‌పై కూడా సేకరణ ఉంటుందని చెప్పారు. ఆయా తేదీల్లో ఉదయం 10.30 నుంచి 1.00 వరకు, మధ్యాహ్నం 2నుంచి 4 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు వీసీలో పాల్గొనేందుకు పొన్నూరు రోడ్‌లోని విద్యుత్ భవన్‌లో, అన్ని డివిజన్ల ఇంజినీర్ కార్యాలయాల్లోనూ ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

# ఓటు హక్కు బుల్లెట్ కంటే శక్తిమంతం

**జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా**

బాపట్ల: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు బుల్లెట్ కంటే శక్తివంతమైందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. భారత ఎన్నికల కమిషన్ ఆవిర్భవించిన సందర్భంగా వేదికపై ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తొలుత జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం దశాబ్దాలుగా ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, ఇతరులకు శాలువలు కప్పి, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల తుది జాబితా విడుదలకు విశేషంగా కృషి చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, నూతన ఓటర్ల నమోదుకు సహకరించిన కళాశాలల ప్రధానాచార్యులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువతీ, యువకులకు ఓటు గుర్తింపు కార్డులను కలెక్టర్ పంపిణీ చేశారు. తదుపరి స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకుంటామని నవికులతో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ అతి ప్రజాస్వామ్య భారతదేశంలో స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించడానికి భారత ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మీ ఓటు హక్కుతో మీ భవిష్యత్ నిర్ణయించుకునే అవకాశం ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 సంవత్సరాలు దాటిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని యంత్రాంగం విశేషంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరించి ఈనెల 22వ తేదీన తుది జాబితా విడుదల చేశామన్నారు. 18 సంవత్సరాలు దాటిన 15 వేల మంది పౌరులకు నూతనంగా ఓటు హక్కు కల్పించి, ఓటర్ల జాబితాలో చేర్పినట్లు వెల్లడించారు. గడిచిన ఆరు నెలల్లో ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, మృతుల తొలగింపు, అర్హత ఉన్నావారందరికీ ఓటు హక్కు కల్పించామన్నారు. 86 శాతం తమ ఓటు హక్కు వినియోగించుకోవడంలో బాపట్ల జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాలు రాష్ట్రంలో ప్రథమ స్థాయిలో నిలిచాయని వివరించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు రెండు నెలల నుంచి ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించినట్లు చెప్పారు. అదనపు ఎస్పీ పి.మహేష్ మాట్లాడుతూ ఓటు ఆవశ్యకత, గౌరవతనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్.శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఓలు జి.రవీందర్, పి.సరోజిని, హేలా షారోన్, వ్యవసాయ కళాశాల డీన్, ప్రధానాచార్యులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఓటరు జాబితాకు సహకరించిన అధికారులకు జ్ఞాపికలను అందిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

**ఎన్నికల నిర్వహణ బాధ్యత మాస్టర్ ట్రైనర్లదే..**

ఎన్నికల నిర్వహణ బాధ్యత మాస్టర్ ట్రైనర్లపై ఉందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. స్థానిక స్పందన సమావేశ మందిరంలో అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్ల తొలి శిక్షణ శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగాలంటే ఎన్నికల సిబ్బందికి సమర్థంగా శిక్షణ ఇవ్వాలని కోరారు. ఎన్నికల నిర్వహణలో సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వాలన్నారు. విధుల్లో పొరపాట్లు జరగకుండా సమర్థంగా పనిచేయడానికి ఎన్నికల మార్గదర్శకాలపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ, డ్వామా పీడీ బి.అర్జునరావు పాల్గొన్నారు.

**స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన**

ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలు ప్రతిష్ట భద్రంగా ఉండేలా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయంలోని కళాశాల భవనాన్ని జిల్లా ఎస్పీతో కలసి గురువారం పరిశీలించారు. ఎన్నికల మార్గదర్శకాలను అనుసరించి స్ట్రాంగ్ రూమ్ ఉండాలన్నారు. ఈవీఎం యంత్రాలకు పటిష్ట భద్రత కల్పించాలని కోరారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రం సమీపంలోనే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బాపట్ల జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు 24 హాల్స్ ఉండాలని సూచించారు. ఎన్నికల ముందు, తదుపరి ఈవీఎం యంత్రాలు తరలింపు, స్ట్రాంగ్ రూములకు చేర్చడంపై ప్రణాళికలు రూపొందించాలని కోరారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా వెంట అదనపు ఎస్పీ పి.మహేష్, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఓలు జి.రవీందర్, పి.సరోజిని, హేలా షారోన్, వ్యవసాయ కళాశాల డీన్, ప్రధానాచార్యులు శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు కృష్ణకాంత్ పాల్గొన్నారు.

### ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో సిబ్బందితో గురువారం ప్రతిజ్ఞ చేయించారు. ఎస్పీ మాట్లాడుతూ 1950 జనవరి 25న జాతీయ ఎన్నికల కమిషన్ ఏర్పడిందని చెప్పారు. ఆ రోజునే జాతీయ ఓటర్ల దినోత్సవాని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైంద పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. మీతో పాటు కుటుంబ సభ్యులకు, తోటి స్నేహితులు ఓటు హక్కు వినియోగించుకోవడంపై చైతన్యం కల్పించాలని చెప్పారు. మతం, జాతి, కులం, వర్గ, భాష లాంటి ఒత్తిళ్ళకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, ఎస్‌బీ సీఐ వి.సూర్యనారాయణ, డీసీ ఆర్‌బీ సీఐ మురళీకృష్ణ పాల్గొన్నారు.

### 29న దుర్గగుడి పాలక మండలి సమావేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన పాలక మండలి సమావేశం సోమవారం జరగనుంది. బ్రాహ్మణ వీధిలోని దేవస్థాన పరిపాలనా భవనంలో ఉన్న బోర్డు మీటింగ్ హాల్‌లో ఉదయం 10–30 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో ఈవో కేఎస్ రామారావు హాజరుకానున్నారు.

### ఉత్తమ బీఎల్‌వోగా మహిళా పోలీస్




మంగళగిరి: మహిళా పోలీస్ తిరువీధుల రేఖ ఉత్తమ బీఎల్‌వోగా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి చేతుల మీదుగా గురువారం అవార్డు అందుకుంది. 188వ పోలింగ్ స్టేషన్ బీఎల్‌ఓగా ఉన్నారు.

### సంతమాగులూరు నేతలు సస్పెన్షన్

అద్దంకి: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడున్నట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో, క్రమ శిక్షణ సంఘం సిఫార్సుల మేరకు సంతమాగులూరు మండలానికి చెందిన నేతలను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఆదేశాలు ఇచ్చారు. నియోజకవర్గంలోని సంతమాగులూరు మండలానికి చెందిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ అట్లా చిన్న వెంకటరెడ్డి, మాజీ మండల కన్వీనర్ అట్లా పెద వెంకటరెడ్డి, మాజీ సర్పంచి జిర్రా విజయ్‌బాబు, పుట్టావారిపాలెం సర్పంచి సన్నెబోయిన గురుబ్రహ్మం, ఎంపీపీ ఎ.యల్లమందను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### చీరాల జనసేన నుంచి పోటీ చేసేది నేనే

**ఆమంచి స్వాములు**



చీరాల: చీరాల నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్లు జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు(శ్రీనివాసరావు) ప్రకటించారు. గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో పందిళ్లపల్లిలోని తన నివాసం నుంచి ఆమోదగిరిపట్నం పార్టీ ఆఫీసు వరకు స్వాములు పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ర్యాలీ, మీడియా సమావేశంలో జనసేన నేత స్వాములు మాట్లాడుతూ... పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను తాను కలిసినప్పుడు ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు సీటు అడిగినట్లు తెలిపారు. అయితే ఇటీవల జరిగిన జనసేన పార్టీ సర్వేలో తనకు అనుకూలంగా సర్వే ఫలితాలు రావడంతో ఆమంచి స్వాములు చీరాల నుంచే పోటీ చేయమని పార్టీ ఆదేశించిందని వెల్లడించారు. త్వరలో నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలతో ప్రతి గ్రామంలో పాదయాత్రలు చేస్తానని చెప్పారు. జనసేన విజయానికి కృషి చేయాలని స్వాములు పిలుపునిచ్చారు. అలానే టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన వ్యక్తిగత పనుల వలన ఈ ర్యాలీలో పాల్గొనలేదని తెలిపారు.

# సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన

**'పల్లె పల్లెకు హనిమిరెడ్డి'లో సమన్వయకర్త చిన హనిమిరెడ్డి**

జే పంగులూరు: రాష్ట్రంలో సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని రామకూరులో 'పల్లె పల్లెకు హనిమిరెడ్డి' కార్యక్రమం గురువారం నిర్వహించారు. తొలుత గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి నాలుగున్నర సంవత్సరాల నుంచి అందుతున్న పథకాలపై ఆరా తీశారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 2019 ఎన్నికల ముందు చెప్పినట్టుగానే కులం, ప్రాంతం, పార్టీలు చూడకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నివేశన స్థలాలు అందించి నూరు శాతం పేదవారికి సొంతింటి కల నిజమైందని వివరించారు. నవరత్నాల అమలుతో ప్రతి ఒక్కరికీ ఆర్థిక భరోసా కల్పించిందని పేర్కొన్నారు. పథకాల అమలు తీరును దేశం అంత రాష్ట్రం వైపు చూస్తుందని చెప్పారు. 2024లో మళ్లీ జగనన్నను సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. గ్రామంలో ప్రతి ఇంటి వద్ద వచ్చిన స్పందన చూస్తుంటే చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడిగా కూడా సెలవు తీసుకునే రోజులు ముందున్నాయని పేర్కొన్నారు.

**పలు కుటుంబాలకు ఆర్థిక సాయం..**

రామకూరు గ్రామానికి చెందిన క్యాన్సర్ రోగికి హనిమిరెడ్డి ఆర్థిక సాయం అందించారు. రెండు కాళ్లు పోగొట్టుకున్న కుందుర్తి రామాంజినేయులకు, ఆర్థిక ఇబ్బందులతో చనిపోయిన పోలూరు రామకోటేశ్వరావు(25) కుటుంబ సభ్యులకు, ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన ప్రసాద్‌కు ఆర్థిక సాయం అందించాడు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ బీపీ కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు జంపాని రవిబాబు, మండల కన్వీనర్ స్వయంపు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పానెం శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పి.రామాంజిమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు ఎ.ఆంజనేయులు, ఎ.వెంకయ్య, ఎం.హనుమంతరావు, డి.రామలింగస్వామి, బీసీ సెల్ మండల కన్వీనర్ సి.భాస్కర్‌రాజు, ఎస్సీ సెల్ కన్వీనర్ బుజ్జి, రైతు సంఘం నాయకుడు రామాంజినేయులు పాల్గొన్నారు.



రామకూరు గ్రామంలో మహిళలకు అభివాదం చేస్తున్న చిన హనిమిరెడ్డి

**వలంటీర్లు అంటే చంద్రబాబుకు భయం**

అద్దంకి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు అందజేస్తున్న వలంటీర్ వ్యవస్థ అంటే చంద్రబాబునాయుడు, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌కు భయం అని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ఎద్దేవా చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో అద్దంకి మండల వలంటీర్లతో ఆత్మీయ సమ్మేళనం గురువారం సాయంత్రం నిర్వహించారు. హనిమిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కులం, మతం చూడకుండా అందరికి వలంటీర్లుగా అవకాశం కల్పించారని చెప్పారు. కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలను యావత్ భారతం పొడిగిందన్నారు. సాక్షాత్తు కేంద్ర మంత్రులే వలంటీర్ వ్యవస్థ బాగుందని, సేవలు చేస్తున్నారని మెచ్చుకోవడం జగనన్న పాలనకు మచ్చుతునకగా పేర్కొన్నారు. నియోజకవర్గానికి కొత్తగా వచ్చిన నాపై అద్దంకి ప్రజలు ఆదరాభిమానాలు చూపిస్తున్నారని వివరించారు. అద్దంకి ప్రజల రుణాన్ని రాబోయే రోజుల్లో సేవ చేసుకుని తీర్చుకుంటానన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి జగన్ మోహన్‌రెడ్డిని మరలా సీఎంను చేసుకోవాలని పిలుపునిచ్చారు. అద్దంకిని గెలిపించుకుని జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గుజ్జుల జగన్ మోహన్‌రెడ్డి, మండల జేసీఎస్ ఇన్‌చార్జి ఇస్తర్ల వెంకట్రావు పాల్గొన్నారు.

# మేమూ ఓటేస్తాం..



నమూనా ఓటు వేసిన అనంతరం వేలు చూపుతున్న చిన్నారులు



ప్రత్తిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో క్యూలో నిలబడి నమూనా ఓటు వేస్తున్న చిన్నారులు

ప్రత్తిపాడు: ఓటు హక్కు పొందడం నుంచి ఓటు హక్కు వినియోగించుకోవడం వరకు ప్రతి ఒక్కరికీ ఓటుపై కనీస అవగాహన తప్పనిసరి. అందుకే విద్యార్థి దశ నుంచి ఓటు ప్రాముఖ్యతను వివరించేందుకు ఎన్నికల సంఘం పాఠశాలలు మొదలు కళాశాలల వరకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. చిన్న వయస్సు నుంచే ఓటుపై చిన్నారులకు కూడా అవగాహన ఉంటే బాగుంటుందని భావించారు ప్రత్తిపాడులోని ఒక అంగన్‌వాడీ కార్యకర్త. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రత్తిపాడు రామనగర్ కాలనీలోని అంగన్‌వాడీ సెంటరు కార్యకర్త జ్యోతిరాణి తన సెంటర్లో ఓటు హక్కు వినియోగంపై చిన్నారులకు డెమో నిర్వహించారు. కేంద్రంలో పోలింగ్ బాక్సు నమూనా తయారుచేసి.. ఒక్కొక్క చిన్నారి పేరు పిలుస్తూ, వారి చేతికి పేపర్ స్లిప్ ఇచ్చి, వారితో తయారుచేసిన బ్యాలెట్ బాక్సులో ఓటు వేయించారు. అంతే కాకుండా చూపుడు వేలిపై బ్లూ మార్కర్‌తో మార్క్ చేసి ఓటు హక్కు వినియోగించుకునే విధానాన్ని చిన్నారులకు వివరించారు. ఇలా అంగన్‌వాడీ స్థాయి నుంచే ఓటు హక్కుపై అవగాహన కల్పించడం వలన రానున్న రోజుల్లో ఓటు అంటే ఏమిటి, ఎలా ఓటు వేయాలి.. ప్రజాస్వామ్య వ్యవస్థ ఏమిటన్నది సులభంగా తెలుస్తుందని, అందుకే ఇలా కేంద్రంలో డెమో ఏర్పాటు చేశానని జ్యోతిరాణి తెలిపారు.

# మెరిటోరియస్ మెడల్‌కు విజిలెన్స్ సీఐ ఎంపిక



అక్కిశెట్టి శ్రీహరిరావు

నగరంపాలెం: మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ (ఎంఎస్‌ఎం)కు ఏపీ పోలీస్ శాఖ నుంచి గుంటూరు రీజనల్ విజిలెన్స్/ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న అక్కిశెట్టి శ్రీహరిరావు ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖకు అందించే అత్యున్నతమైన 'ఎంఎస్‌ఎం'కు ఏపీ నుంచి సీఐ శ్రీహరిరావు ఎంపికకావడంపై గుంటూరు రీజినల్ విజిలెన్స్/ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగపు ఎస్పీ కె.ఈశ్వరరావు, పలు శాఖల ఉన్నతాధికారులు, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది గురువారం గుంటూరులోని కార్యాలయంలో పుష్పగుచ్ఛాలతో అభినందించారు. అక్కిశెట్టి శ్రీహరిరావు 2002లో పోలీస్ శాఖలో ఆర్‌ఎస్‌ఐగా చేరారు. ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతం (మార్కాపురం సబ్ డివిజన్)లోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నాలుగేళ్లపాటు సమర్థంగా విధులు నిర్వర్తించారు. అనంతరం సివిల్ ఎస్‌ఐగా ప్రకాశం జిల్లాలోని రాచర్ల, పర్చూరు, తాళ్లూరు, బల్లికురవ పోలీస్‌స్టేషన్ల (పీఎస్) పరిధిలో లా అండ్ ఆర్డర్/ క్రైం విభాగాల్లో విధులు చేపట్టారు. 2016లో సీఐగా ఉద్యోగోన్నతి పొందగా, మూడేళ్లపాటు ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా పరిధిలోని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)లో, 2019లో తుళ్లూరు పీఎస్‌లో, 2021 నుంచి గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగపు సీఐగా విధులు నిర్వర్తిస్తున్నారు.

# నేటి నుంచి బైబిల్ మిషన్ మహోత్సవాలు

- 29 వరకు కొనసాగనున్న ప్రార్థనలు
- ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు
- వంటశాలలను ప్రారంభించిన రెవరెండ్ శామ్యేల్‌కిరణ్

పెదకాకాని: దైవజనులు ఎం దేవదాసు అయ్యగారు బయలుపరచిన బైబిల్ మిషన్ మహోత్సవాలు నాలుగు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు మహోత్సవాల ప్రెసిడెంట్ రెవరెండ్ జె.శామ్యేల్‌కిరణ్ తెలిపారు. శుక్రవారం నుంచి ఈనెల 29వ తేదీవరకూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా మహోత్సవాలకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొంటారన్నారు. దైవ వర్తమానం ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ జరుగుతుందన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు బైబిల్ మిషన్ ప్రాంగణం నుంచి బస్సులను నడిపించేందుకు ఏర్పాట్లు చేశారని తెలిపారు. నాలుగు రోజులపాటు లక్షలాది మంది భక్తులకు తయారుచేసే వంటశాలలను పొయ్యి వెలిగించి వంట ఏర్పాటును ప్రారంభించారు.



వంట ప్రారంభిస్తున్న మహోత్సవాల ప్రెసిడెంట్ రెవరెండ్ శామ్యేల్‌కిరణ్

### నేటి నుంచి బీసీసీఐ అండర్–23 మహిళల క్రికెట్ మ్యాచ్‌లు



విజయవాడస్పోర్ట్స్: మంగళగిరి, ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు లోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) మైదానాల్లో శుక్రవారం నుంచి బీసీసీఐ అండర్–23 మహిళల క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమవుతున్నట్లు ఏసీ ఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి ఏడో తేదీ వరకు జరిగే మ్యాచ్‌లకు హైదరాబాద్, మేఘాలయ, బరోడా, విదర్భ, ఉత్తరప్రదేశ్, ఉత్తరా ఖండ్, జార్ఖండ్ జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయని, టా ప్–2 జట్లు నాకౌట్ పద్ధతిలో తలపడతాయని వివరించారు. శుక్రవా రం డీవీఆర్ మైదానంలో బరోడా–విదర్భ, సీపీ మైదానంలో హైదరాబాద్–ఉత్తరాఖండ్, మంగళగిరిలో మేఘాలయ–ఉత్తరప్రదేశ్ జట్లు తలపడతాయి.

# నడింపాలెంకు 'హెల్దీ' గౌరవం

**గణతంత్ర వేడుకల్లో పాల్గొనాలని సర్పంచ్, క్లాప్‌మిత్రలకు ఆహ్వానం**

ప్రత్తిపాడు: నడింపాలెం పంచాయతీకి అరుదైన గౌరవం దక్కింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో జరిగే జాతీయ పరేడ్‌లో పంచాయతీరాజ్ సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో 23 పంచాయతీలకు ఢిల్లీ నుంచి ఆహ్వానాలు అందాయి. హెల్దీ పంచాయతీ కేటగిరీలో నడింపాలెం పంచాయతీ సర్పంచ్ లాం రత్న కుమార్‌తోపాటు క్లాప్ మిత్ర పులుసు మస్తానమ్మలకు ఆహ్వానాలు అందాయి. వీరు రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాలు అందుకోనున్నారు. ఇదే గ్రామ పంచాయతీ నుంచి మరో క్లాప్‌మిత్ర ఎం.అంజమ్మ రాష్ట్రస్థాయిలో స్వచ్ఛసర్వేక్షణ్ నుంచి బెస్ట్ క్లాప్ మిత్రగా పురస్కారం అందుకోనున్నారు.

**ఇప్పటి వరకు అందుకున్న అవార్డులు..**

- జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా జిల్లాలో మొదటి ర్యాంకు సాధించింది.
- హెల్దీ విలేజ్ కేటగిరీలో రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. గతేడాది పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా 'బెస్ట్ హెల్దీ పంచాయతీ' పురస్కారాన్ని సర్పంచ్ అందుకున్నారు.
- జిల్లా ఉత్తమ క్లాప్‌మిత్రగా పులుసు మస్తానమ్మకు అవార్డు లభించింది.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

ఆర్డీఓ హేలా షారోన్



**చెరుకుపల్లి:** రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని ఆర్డీఓ హేలా షారోన్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలువురు సీనియర్ ఓటర్లను గురువారం సన్మానించారు. ఆమె మాట్లాడుతూ కుల, మత, లింగ వివక్ష లేకుండా రాజ్యాంగం ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించిందని చెప్పారు. దేశాన్ని, రాష్ట్రాన్ని, ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించే, నిస్వార్థంగా పని చేసే నాయకుడి ఎన్నికునేందుకు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు అవకాశం కల్పిస్తోందని వివరించారు. ఈ సందర్భంగా ఓటర్లతో ఓటు హక్కు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## వైభవంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ గురువారం వైభవంగా జరిగింది. పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువైన ఇంద్రకీలాద్రి కొండ చుట్టూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో దుర్గమ్మ భక్తులు, ఉభయదాతలు, ఆలయ అధికారులు, సిబ్బంది, సేవా సిబ్బంది విశేషంగా పాల్గొన్నారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. తెల్లవారుజామున 5.55 గంటలకు ఘాట్‌రోడ్డు వద్ద ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు, వేద పండితులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు కొబ్బరి కాయ కొట్టి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉండగా, దేవస్థాన ప్రచార రథం ముందుకుసాగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గిరి ప్రదక్షిణ సాగింది. కుమ్మరి పాలెం, విద్యాధరపురం, నాలుగు స్తంభాల సెంటర్, చెరువు సెంటర్, సితార జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదగా మహా మండపం వరకు ప్రదక్షిణ సాగింది.

## గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎమ్మెల్యే కరణం, నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేష్



సిమెంట్ రోడ్లను ప్రారంభిస్తున్న సమన్వయకర్త వెంకటేష్, ఎమ్మెల్యే బలరాం

**చీరాల:** నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీతో పాటుగా శివారు కాలనీలను సుందరంగా తీర్చిదిద్ది ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేష్ అన్నారు. మండలంలోని బోయినవారిపాలెంలో రూ.43 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.2 కోట్లతో నిర్మించిన పలు సిమెంటు రోడ్లను గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేస్తున్నామని చెప్పారు. చీరాల, వేటపాలెం మండలాల్లో ఉన్న 24 గ్రామ పంచాయతీలు, అంతర్గత గ్రామాలు, శివారు కాలనీల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో ముందుంటున్నామన్నారు. అన్నదాతలకు అండగా ఉంటున్న సీఎం వైఎస్ జగన్‌కు అందరం అండగా నిలవాలని, రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎంగా, చీరాల ఎమ్మెల్యేగా వెంకటేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

**నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం..**

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు తమపై పెట్టుకున్న ప్రతి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని చెప్పారు. అభివృద్ధికి ఎమ్మెల్యే బలరాం, తాను ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని వివరించారు. సంపూర్ణ సహకారం అందిస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటామన్నారు. జగనన్న ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూములు పంపిణీ, పేదలందరికి ఇళ్లు, నివేశన స్థలాలు అందించినట్లు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగనన్నను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలన్నారు. బోయినవారిపాలెం గ్రామానికి రూ.2.50 కోట్లతో రోడ్లు, సచివాలయం నిర్మాణం గొప్ప వరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బిసస్ బాబు, పీఆర్ డీఈ శేషయ్య, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు అంకాళరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కేశవులు, పార్టీ నేతలు బి.శివపార్వతి, బిట్రా శ్రీను, శీలం వెంకటేశ్వరమ్మ, రమణ, అద్దంకిరెడ్డి, రవి, రామచంద్ర పాల్గొన్నారు.

## వైద్య రంగంలో విప్లవాత్మక మార్పుల ఘనత వైఎస్ జగన్‌దే

- బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి
- పీవీ పాలెంలో ఆస్పత్రి ప్రారంభం



రిబ్బన్ కత్తిరించి బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

**పిట్టలవానిపాలెం:** విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మండల కేంద్రంలో రూ.7.36 కోట్లతో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని గురువారం ప్రారంభించారు. తొలుత గ్రామంలో రూ.22 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో అత్యాధునిక హంగులతో వైద్యశాలను నిర్మించుకోవడం చాలా సంతోషమని పేర్కొన్నారు. 30 పడకల వైద్యశాలను రానున్న రోజుల్లో వంద పడకల వైద్యశాలగా స్థాయి పెంచేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఇంత ఖర్చు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాల కోసం నిర్మించిన వైద్యశాలలో వైద్యులు సాయంత్రం 4 గంటల తర్వాత అందుబాటులో లేకపోవడం విచారకమని చెప్పారు. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. గత టీడీపీ హయాంలో వైద్యశాలల్లో వైద్యులు అందుబాటులో ఉండేవారు కాదని అన్నారు. సీఎం వైఎస్ జగన్ వైద్యశాలలు అభివృద్ధి చేయడంతో పాటు వైద్యులు, సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించినట్లు వివరించారు. ఈ వైద్యశాలలో గైనకాలజిస్టు, చిన్నపిల్లల వైద్యులు, మత్తు డాక్టర్ ఉన్న విషయం తెలుసుకుని ఆశ్చర్యానికి గురయ్యానన్నారు.

**గతానికి భిన్నంగా..**

టీడీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించాలన్నా, ప్రభుత్వ వైద్యశాలలకు వైద్య సేవల కోసం రావాలన్నా ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేవారని ఎమ్మెల్యే కోన గుర్తు చేశారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ బాజి, వైస్ ఎంపీపీ డి.సీతారామరాజు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వై.అశ్వినిరెడ్డి, సర్పంచి బొలగాని అరుణ కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు బి.సుబ్బారావు, ఎ.సురేష్‌బాబు, ఎం.విజయ్ కుమార్, అహ్మద్ హుస్సేన్, సీహెచ్ వీరయ్య, మునీర్, డి.కోటిరెడ్డి, అల్లూరు మాజీ సర్పంచి బడుగు ప్రకాశరావు, యువజన విభాగం మండల కన్వీనర్ పమిడి గోపి, వాలి వెంకటశివారెడ్డి బాపట్ల ఏఎంసీ డైరెక్టర్లు టి.శ్రీనివాసరావు, ఎస్.ధనలక్ష్మి, ఎన్.శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు సీహెచ్ విజయరాజు, గంగయ్య, సురేష్, గ్రామ సర్పంచులు ఎస్.నాగిరెడ్డి, మాధవరావు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు పాత్ర అమూల్యం

- జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి
- అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ
- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

**నరసరావుపేట:** ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు పాత్ర అమూల్యమని, దాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బందితో 'ఓటర్స్ డే' గురువారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు దినోత్సవం ప్రధాన లక్ష్యం ఓటర్లకు సాధికారిత, జాగరూకత, భద్రత కల్పిస్తూ సమాచారాన్ని అందించడమని తెలిపారు. ఓటు హక్కుతో దేశ భవితవ్యాన్ని మార్చగల శక్తి ఓటర్లందరికీ ఉందని చెప్పారు. కొత్త ఓటర్ల నమోదుకు యువతను చైతన్యం చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉంచి, ప్రలోభాలకు లొంగకుండా కుల, మత, వర్గ, భాష, ఒత్తిడిలకు లోనుకాకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యర్థుల దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలు



**కారెంపూడి:** వివాహ సందర్భంలో తలెత్తిన వివాదం చివరకు అది దాడికి దారితీసి ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామ శివారు రెడ్డిపాలెం ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.

కాలనీలో జరిగిన ఓ వివాహంలో దాయాదుల మధ్య గొడవ జరగడంతో కొమ్ము చిన యేసోబు, కొమ్ము పేరయ్య తదితరులు ప్రత్యర్థులపై బుధవారం రాత్రి కారెంపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ప్రత్యర్థులు కూడా కౌంటర్ కేసు పెట్టేందుకు కారెంపూడి వస్తున్న సందర్భంలో రెండు వర్గాలు ఎదురుపడ్డాయి. ఈ నేపథ్యంలో ఉద్రేకంతో చిన యేసోబు, పేరయ్యలపై ప్రత్యర్థులు ఇనుప రాడ్లతో దాడి చేయడంతో వారికి చేతులపై బలమైన గాయాలయ్యాయి.బాధితులు గురజాల ప్రభుత్వ అసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ ఎం. రామాంజనేయులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రత్యర్థులు కూడా కౌంటర్ కేసు దాఖలు చేశారు.


### సైడు కాలువలో పడి యువకుడు మృతి

**బల్లికురవ:** పొలం వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదవశాత్తు గ్రామంలోని సైడు కాల్వలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం బల్లికురవ మండలంలోని అంబడిపూడిలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన గుంటుపల్లి ఈశ్వరరావు(33) పొలం వెళ్లి ఇంటికి వస్తూ గ్రామంలోని సైడు కాలువలో పడ్డాడు. పెద్ద శబ్దం రావటంతో ఇరుగుపొరుగువారు వచ్చి చూసి కాలువలో నుంచి బయటకు తీసేలోపు మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు. తండ్రి శింగయ్య ఉన్న కొద్దిపాటి పొలానికి తోడు కౌలు తీసుకుని వివిధ పంటల సాగుతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

### రైలు నుంచి జారిపడి వ్యక్తి..

**చీరాల రూరల్:** రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చీరాల- వేటపాలెం రైల్వే స్టేషన్‌ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాలు.. చీరాలకు సమీపంలోని జాండ్రపేట వద్ద అప్‌లైన్, డౌన్ లైన్ రైలు పట్టాల మధ్యలో వ్యక్తి మృతి చెందాడని గుర్తించినట్లు చెప్పారు. మృతదేహం వద్ద ఎటువంటి సమాచారం లభ్యం కాలేదని, మృతుడి వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందని వివరించారు. సమాచారం తెలిస్తే 94406 27646 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### సాగర్‌లోకి దూకి వ్యక్తి ఆత్మహత్య



**విజయపురిసౌత్:** సాగర్‌లోకి దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. విజయపురిసౌత్ ఎస్ఐ డి.వెంకట కొండారెడ్డి కథనం మేరకు... తెలంగాణ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం బొంగుళూరుకు చెందిన ఆటో డ్రైవర్ బండ మల్లేష్(49) ఆస్తి విషయంలో కుటుంబ సభ్యులతో మనస్పర్థలు రావడంతో మూడు రోజుల కిందట నాగార్జున సాగర్ వచ్చాడు.అనంతరం సాగర్ డ్యామ్ స్పిల్ వే సమీపంలోని దిగువ కృష్ణా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం మృతదేహం జలాశయంపై తేలియాడుతూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కొండారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని నదిలో నుంచి మృతదేహాన్ని సిబ్బంది సహాయంతో ఒడ్డుకు చేర్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## గణతంత్ర వేడుకలకు పగడ్బందీ ఏర్పాట్లు

జాయింట్ కలెక్టర్ శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీధర్

**బాపట్ల:** భారత గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. గణతంత్ర దినోత్సవం ఏర్పాట్లపై అన్ని శాఖల జిల్లా అధికారులతో గురువారం ఆయన తన చాంబర్లో సమీక్షించారు. బాపట్ల జిల్లా అభివృద్ధిని చాటి చెప్పేలా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని కోరారు. కలెక్టరేట్ ఆవరణలోని పోలీస్ కవాతు మైదానంలో ఏర్పాటు చేసే కార్యక్రమాలు వేడుకగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. తాగునీరు, పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. సంప్రదాయాలు, దేశ భక్తి ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఉండాలన్నారు. స్టాల్స్, శకటాల ప్రదర్శన అత్యద్భుతంగా ఉండాలని చెప్పారు. అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ పాల్గొన్నారు.

## అందుబాటులో మొబైల్ ఆధార్ సెంటర్లు

జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రాజ్ డెబోరా



ఆధార్ నమోదు పత్రాన్ని అందజేస్తున్న డెబోరా

**వేటపాలెం:** గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ సెంటర్లను యానాదులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రాజ్ డెబోరా సూచించారు. మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ జగన్నాథపురం ఎస్టీ కాలనీలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్‌ను గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ చీరాల, వేటపాలెం మండలాల్లో నెల రోజులుగా నెల్లూరు ఐటీడీఏ సహకారంతో మొబైల్ ఆధార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 350 మందికి ఆధార్ నమోదు చేశామని తెలిపారు. గిరిజనులైన యానాదులు వారి పిల్లలను పాఠశాలలకు పంపించి చదివించుకోవాలని సూచించారు. ఎస్టీల్లో ఆధార్ నమోదు చేసుకోని వారు వెంటనే ఆధార్ సెంటర్‌లో నమోదు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వారికి ఆధార్ ప్రాధాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు అద్దంకి అంకారావు, ఉపాధ్యక్షుడు చేవూరి శివకోటి పాల్గొన్నారు.

## నేటి నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో



సమావేశంలో మాట్లాడుతున్న మామిడి రాము

**పాత గుంటూరు:** గుంటూరు రింగ్ రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో ఈ నెల 26, 27, 28 తేదీల్లో క్రెడాయ్ గుంటూరు చాప్టర్ 7వ ప్రాపర్టీ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి తెలిపారు. గుజ్జనగుండ్లలోని ఓ హోటల్‌లో గురువారం ప్రాపర్టీ షో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సభకు క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము అధ్యక్షత వహించారు. శివారెడ్డి మాట్లాడుతూ ప్రాపర్టీ షోలో బిల్డర్స్, బ్యాంకర్స్ పాల్గొంటారన్నారు. ఇళ్ల నిర్మాణం, బ్యాంకుల రుణాలు తదితర విషయాల్ని తెలుసుకోవడానికి ప్రజలకు అవకాశం ఉంటుందని తెలిపారు. పట్టణ ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మామిడి రాము మాట్లాడుతూ ప్రాపర్టీ షో ద్వారా ప్రతి ఒక్కరి సొంత ఇంటి కల నెరవేరుతుందని పేర్కొన్నారు. ఒక ఇంటిని నిర్మించుకోవాలన్నా, కొనుక్కోవాలన్నా అన్నీ ఒకే వేదికపై తెలుసుకొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. క్రెడాయ్ గుంటూరు చైర్మన్ ఆరుమళ్ల సతీష్‌రెడ్డి మాట్లాడుతూ బిల్డింగ్ మెటీరియల్స్, బ్యాంకులు, ప్రముఖ బిల్డర్ సంస్థలు పాల్గొనే ప్రాపర్టీ షోను నగర ప్రజలు సందర్శించాలని కోరారు. మొత్తం 80 స్టాల్స్ ఉంటాయని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించనున్నారని చెప్పారు. సమావేశంలో క్రెడాయ్ గుంటూరు వైస్ ప్రెసిడెంట్ మెట్టు సాంబశివారెడ్డి, సెక్రటరీ తియ్యగూర వినోద్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ శివనాగేశ్వరరావు, రమాకాంత్, షో కన్వీనర్ గుంటూరు వెంకటరెడ్డి, ఈసీ మెంబర్స్ పి. వేణుగోపాలరెడ్డి, బోనా శివనాగబాబు పాల్గొన్నారు.

## బజరంగ్ వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

- 1287 మందికి నేత్ర, గుండె పరీక్షలు
- ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ వెల్లడి



వైద్య శిబిరానికి వచ్చిన వారితో అంబటి మురళీకృష్ణ

**చేబ్రోలు:** మండల కేంద్రంలోని పాత పోలీస్ స్టేషన్ ప్రాంతంలో బజరంగ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన జగన్నామ సంక్షేమ సంగమం శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా తొలిరోజు గురువారం వైద్య శిబిరానికి 1287 మంది తరలివచ్చి కంటి, గుండె పరీక్షలు చేయించుకున్నారు. వీటితో పాటు ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకున్నారు. వీరిలో 27 మందిని వైద్యులు యాంజియోగ్రామ్‌కు సూచించగా, వారిని సోమవారం ఉదయం ప్రత్యేక వాహనంలో విజయవాడకు తీసుకెళ్లి వైద్య సేవలు అందించటం జరుగుతుందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం నుంచి స్ఫూర్తి పొంది ఏడాది కాలంగా జగన్నామ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. బజరంగ్ జగన్నామ నేత్ర జ్యోతి కార్యక్రమంలో ఉచిత నేత్ర వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఏడు పని దినాల్లో కళ్లజోళ్ల పంపిణీ, మీ గుండె పదిలం కార్యక్రమంలో ఉచిత గుండె పరీక్షలు, అవసరమైన వారికి యాంజియోగ్రామ్ నిర్వహించి సమస్య ఉన్న వారికి స్టంట్స్, బైపాస్ సర్జరీలు చేయించటం జరుగుతుందన్నారు. దివ్యాంగ దర్శిని కార్యక్రమంలో దివ్యాంగులకు ట్రై సైకిల్స్, జైపూర్ కాలు, వెస్ట్రన్ కమోడ్‌లు అందజేస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు 86 కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన బజరంగ్ ఫౌండేషన్ 87వ కార్యక్రమాన్ని చేబ్రోలులో ఏర్పాటు చేసిందన్నారు. కాగా, వృద్ధులు, మహిళలు, వికలాంగులను ప్రత్యేక వాహనాల ద్వారా శిబిరానికి తీసుకువచ్చి, పరీక్షలు నిర్వహించి తిరిగి అవే వాహనాలలో పంపడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

**నేడు కూడా వైద్యశిబిరం**

చేబ్రోలులో శుక్రవారం కూడా శిబిరం జరుగుతుందని అంబటి మురళీకృష్ణ తెలిపారు. హైస్కూల్ రోడ్డు సమీపంలోని జీబీసీ రహదారి పక్కన శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నేత్ర, గుండె పరీక్షలు, ఫిజియోథెరపీతోపాటు వికలాంగులకు వైద్య సేవలు అందజేయనున్నట్లు తెలిపారు. దీనిని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.